https://teluguislam.net



# అధ్యాయం – 1

# 31–62

## 1–అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు

- అల్లాహ్ ప్రీతి పొందుటకై తొలి అంశం.
- అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే మౌలిక విశ్వాసాలు.
- ఇస్లాం ధర్మాన్నే ప్రేమించాలి.
- సర్వజనులకన్నా అల్లాహ్‌ను మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రేమించాలి .
- ధృఢమయిన విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రేమించాలి.
- విశ్వాసం  మరియు ఏకదైవారాధన అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం.
- అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతే ప్రేమకు పునాది.

https://teluguislam.net



బిస్మిల్లాహ్ హిర్రహ్ హమా నిర్రహీమ్

# 1–అల్లాహ్ ప్రేమ పొందుటకు మౌలిక అంశాలు

## అల్లాహ్ ప్రీతి పొందుటకై తొలి అంశం:

మానవులు అల్లాహ్ ప్రేమను నోచుకోవాలంటే మరియు వారు చేసే కార్యాలకు ప్రతి ఫలం లభించాలంటే, మానవుల మొట్టమొదటి కార్యం **''లా ఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మదుర్ రసూలుల్లాహ్''** అని పలికి, దాని వాస్తవాన్ని మనసారా గ్రహించి, దానికి అనుగుణంగా జీవితాన్ని గడపడమే అల్లాహ్ ప్రేమాభిమానాలు పొందుటకు తొలి కార్యం. అంటే మనసా, వాచా, కర్మణ – త్రికరణ శుద్ధితో ఆ వచనాన్ని అంగీకరించాలి.

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కనుక (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో.నీ పొరపాట్లకుగాను క్షమాపణ వేడుకుంటూ ఉండు.... [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ప్రవక్తా) ఇలా అను: ఓ గ్రంథ ప్రజలారా! మాకు మరియు మీకు మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం (ఉత్తరువు) వైపునకు రండి, అది ఏమిటంటే: 'మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు, ఆయనకు భాగస్వాములగా ఎవ్వరిని నిలబెట్టకూడదు. మరియు అల్లాహ్ తప్ప, మనవారిలో నుండి ఎవ్వరిని ప్రభువులుగా చేసుకోరాదు.' వారు (సమ్మతించక) తిరిగిపోతే: 'మేము నిశ్చయంగా అల్లాహ్‌కు విధేయు(ముస్లిం)లము దీనికి మీరు సాక్షులుగా ఉండండి' అని పలుకు. [2]

---

[1] (సూరతు ముహమ్మద్:19).

[2] (సూరతు ఆలి ఇమ్రాన్:64).

https://teluguislam.net



మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) గారిని యమన్ దేశానికి పంపినప్పుడు ఇలా హితబోధ చేశారు:

**''ఓ ముఆజ్!** నువ్వు గ్రంథవహులైన ప్రజల దగ్గరికి వెళుతున్నావు. కనుక ముందుగా నువ్వు వారిని:

**''లా ఇలాహ ఇల్లల్లాహు''** (అల్లాహ్ తప్ప నిజమైన మరో ఆరాధ్యుడు లేడు) అని సాక్ష్యం పలకమని ఆహ్వానించు...''అని అన్నారు.[1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: అబూ హురైరా!........ **''లా ఇలాహ ఇల్లల్లాహు''** (అల్లాహ్ తప్ప నిజమైన మరో ఆరాధ్యుడు లేడని) దృఢ చిత్తంతో పలికేవారు ఎవరు కనిపించినా వారికి స్వర్గ శుభవార్తను అందించు. అని అన్నారు.[2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **ఓ ప్రజల్లారా! 'లా ఇలాహ ఇల్లల్లాహు'** అని చెప్పండి. మీరు సాఫల్యం పొందుతారు. (ముస్నద్ అహ్మద్, సహీహ్ ఇబ్ను హిబ్బాన్, సహీహ్ ఇబ్ను ఖుజైమా)

అదే విధంగా ఎవరి నోట **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అని తుది పలుకులు ఉంటాయో వారికి పరలోకంలో అల్లాహ్ వద్ద సాఫల్యం ఖాయం.

హజ్రత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''తన జీవితపు తుదిపలుకు **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అయిన వ్యక్తి స్వర్గానికి వెళ్తాడు.''[3]

---

[1] (బుఖారీ:1401, ముస్లిం:19).
[2] (ముస్లిం:31).
[3] (హాకిమ్, అబూదావూద్: 3116).

https://teluguislam.net



అదే విధంగా అల్లాహ్ వద్ద అన్నింటి కంటే విలువైనది కర్మల పత్రం **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అనే పదాలు. కనుక హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం:

"నిశ్చయంగా (పరలోకం కోసం) మనం సమాకూర్చుకునే (సామగ్రిలో) అత్యంత విలువైనది అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దేవుడు మరొకడు లేడని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దైవ ప్రవక్త అని సాక్ష్యం చెప్పటం…" అని అన్నారు.[1]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ప్రళయ దినాన ప్రజలందరి ముందు నా ఉమ్మత్‌కు చెందిన ఒక వ్యక్తిని కేకలు పెట్టి పిలువడం జరుగుతుంది. తరువాత అతని ముందు తొంభైతొమ్మిది (కర్మల) పత్రాలను తెరిచి పరుస్తారు. ప్రతి పత్రం అతను చూడగలిగినంత దూరం వరకూ (పెద్దదిగా) ఉంటుంది."

తరువాత అల్లాహ్ అతనితో: "దీని (పాపాల పత్రాల)లో నీవు చేయని (విషయాలు) ఏమైనా ఉన్నాయనీ చెప్పగలవా? అని ప్రశ్నిస్తాడు. అతను "లేదు నా ప్రభూ!" అని అంటాడు.

మరలా అల్లాహ్ అతనితో: "వాటిని జాగ్రత్తగా రాసేవారు (మున్కర్, నకీర్) నీపై (నీ పత్రాలలో) అన్యాయంగా ఏమైనా రాశారా!" అని ప్రశ్నిస్తాడు.

తరువాత అల్లాహ్ అతనితో: "నీ వద్ద వాటికి (ఆ పాపాల పత్రాలకు) బదులు పుణ్యాలేమైనా ఉన్నాయా?" అని ప్రశ్నిస్తాడు.

---

[1] (ముస్లిం:173).

https://teluguislam.net



అప్పుడు అతను లోలోన భయపడుతూ: ‘‘నా వద్ద (పుణ్యాలు) లేవు’’ అని అంటాడు.

ఆ తరువాత అల్లాహ్ అతనితో: ‘‘ఎందుకులేవు మా వద్ద నీ పుణ్యం ఒకటుందీ. ఈ రోజు మేము ఎవరికీ అన్యాయం చెయ్యబోము’’ అని అల్లాహ్ (షహాదత్) **‘‘అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు, వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు’’** అన్న పత్రాన్ని అతనికి ప్రసాదిస్తాడు.

(దాన్ని చూసి) అతను: ‘‘ఓ అల్లాహ్! ఈ ఒక్క పత్రం అన్ని (పాపాల) పత్రాలకు సరిసమానమవుతుందా? అని ఆశ్చర్యపడుతూ అంటాడు.

తరువాత అల్లాహ్: **‘ఈ రోజు నీకు ఎలాంటి అన్యాయం జరగదనీ’** అంటాడు. తరువాత: (అతని పాపాల) పత్రాలన్ని ఒక పళ్లెంలో వేస్తారు. మరియు **‘షహాదత్’** పత్రం మరొక పళ్లెంలో వేస్తారు. ఆ (పాపాల) పత్రాలన్ని తేలికైపోతాయి. **‘షహాదత్’** పత్రం (అన్ని పత్రాలపై) బరువైపోతుంది. (ఎందుకంటే) **‘అల్లాహ్ పేరు కంటే (ఎక్కువ) ఏదీ బరువుగా ఉండదు’** అని అంటాడు. [1]

## అల్లాహ్ ప్రేమకు కారణమయ్యే మౌలిక విశ్వాసాలు:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మీరు మీ ముఖాలను తూర్పు దిక్కుకో, పడమర దిక్కుకో తిప్పటమే సదాచరణ కాదు. సదాచరణ అంటే వాస్తవానికి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, అల్లాహ్ దూతలనూ, అల్లాహ్ గ్రంథాన్నీ, అల్లాహ్ ప్రవక్తలనూ విశ్వసించటం. ధనప్రీతి ఉన్నప్పటికీ సమీప

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2963, సహీహ్ ఇబ్నుమాజ: 4300).

https://teluguislam.net



బంధువులకు, అనాథలకు, అగత్యపరులకు, బాటసారులకు, యాచించే వారికి (ధనాన్ని) ఇవ్వటం. బానిసులకు విముక్తి నొసగటం, నమాజులను నెలకోల్పటం, జకాతును చెల్లిస్తూ ఉండటం, ఇచ్చిన మాటను నిలుపుకోవటం, లేమిలో కష్టకాలంలో, యుద్ధ సమయాలలో సహన స్థయిర్యాలను కనబరచటం-ఇవన్నీ కలిగి ఉన్నవారే వాస్తవానికి సత్యమూర్తులు, భయభక్తులు కలవారు కూడా వీరే.'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీలో ఎక్కువగా దైవభీతి గలవారే అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం గలవారు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు.'' [2]

నిజానికి సత్కార్యం అంటే ధర్మం యొక్క మౌలికాంశాలపై దృఢ విశ్వాసం కలిగి ఉండాలి. దైవం సూచించిన మంచి పనులను సజావుగా నిర్వర్తించాలి. నీతీ నడవడికలను కలిగి ఉండాలి. అల్లాహ్‌ను విశ్వసించటమంటే ఖుర్ఆన్, హదీసులలో సూచించబడినట్లుగా ఆయన అస్థిత్వాన్ని, ఆయన గుణగణాలను, ఆయన అధికారాలను వక్రభాష్యాలు చెప్పకుండా, ఉపమానాలు ఇవ్వకుండా విశ్వసించాలి. ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటినీ శిరసావహించాలి. అంతిమ దినాన్ని విశ్వసించటమంటే అర్థం శిక్షాబహుమానాల దినాన్ని స్వర్గ నరకాలను నమ్మటం. అలాగే దైవ గ్రంథాన్ని విశ్వసించటమంటే అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నిటినీ నమ్మాలన్న భావం అందులో అంతర్లీనమ్మై

[1] (సూరతుల్ బఖరా:177).
[2] (సూరతుల్ హుజురాత్: 13).

https://teluguislam.net



ఉంది. దైవదూతల ఉనికిని సత్యమని ధృవీకరించాలి. దైవప్రవక్తలందరి రాకను నిజమని నమ్మాలి. ఈ విశ్వాసాలతో పాటు (అంటే దేవుని హక్కులతో పాటు) సత్కార్యాలు (దాసుల హక్కులు) కూడా నెరవేర్చాలి. సిరిసంపదల పట్ల ఎంత వ్యామోహం ఉన్నప్పటికీ ఆప్తులకు అవసరం ఉన్నవారికీ ఎంతోకొంత ఇవ్వాలి. కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లో కలవర పడకుండా ఆత్మ నిబ్బరంతో పరిస్థితులకు ఎదురీదటం నేర్చుకోవాలి. ఇది చెప్పుకున్నంత సులభంకాదు. చాలా కఠినమయిన విషయం. అయితే కలిమిలో ఉబ్బితబ్బిబ్బవకుండా, లేమిలో కృంగిపోకుండా మసులుకునే సజ్జనులను అల్లాహ్ అమితంగా ఇష్టపడుతాడు....[1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడనీ, ఆయన ఒక్కడేననీ, ఆయనకు ఇతర భాగస్వాములెవరూ లేరనీ, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన దాసుడు మరియు ప్రవక్త అనీ, అలాగే ఈసా (శ్రీ యేసు) అలైహిస్సలామ్ కూడా అల్లాహ్ దాసుడు, ఆయన ప్రవక్త మాత్రమే అనీ, కాకపోతే ఆయన (తన తల్లి) మర్యమ్ వైపుకు చేరవేయబడిన దైవాజ్ఞ అనీ, దేవుని తరఫునుంచి వచ్చి (మర్యమ్ గర్భంలో శిశువు రూప దాల్చి)న ఒక ఆత్మ మాత్రమేననీ, స్వర్గ, నరకాల ఉనికి యదార్థమనీ ధృవీకరించిన వ్యక్తిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు– అతని ఆచరణ ఎలాగున్నా సరే."[2]

**ముఖ్యగమనిక:** పై హదీసు ద్వారా దైవప్రవక్తలు కూడా మానవ మాత్రులన్న విషయం బోధపడుతోంది. దైవప్రవక్తలు భగదవతారాలన్న

---

[1] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 118)

[2] (బుఖారీ:3180, ముస్లిం:41).

https://teluguislam.net



భావనను ఈ హదీసు త్రోసిపుచ్చుతోంది. క్రైస్తవులు యేసుక్రీస్తును దేవుని కూమారుడన్నారు,యూదులు ఉజైర్‌ను దేవుని కుమారుడన్నారు. సహవాస దోషంవల్ల ఈవ్యాధి కొంతమంది ముస్లింలకు కూడా అంటుకుంది. ముస్లింలలోని ఒక వర్గం మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాక్షాత్తు **దేవుని వెలుగు** అని అనటం మొదలుపెట్టారు. ఆయన్ని ఓ మానవ తీత శక్తిగా తలపోస్తున్నారు. ఇవన్నీ పెడభావాలు తప్ప మరేమీ కావు.

**వెలుగు (నూర్) అనేది అల్లాహ్ గుణం.** అల్లాహ్ పేర్లలోగాని, ఆయన గుణగణాల్లో గాని వేరొకరిని సాటి కల్పిస్తే 'షిర్క్' (బహుదైవారాధన) చేసినట్లవుతుంది. దైవప్రవక్తలు మానవమాత్రులేనని సాక్ష్యం చెప్పటం కూడా విశ్వాసం (ఈమాన్)లో అంతర్భాగమే. దాన్ని నిరాకరిస్తే మొత్తం ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని నిరాకరించినట్లవుతుంది.

హజ్రత్ ఈసా – అలైహిస్సలామ్– **'కలిమతుల్లాహ్'** (అల్లాహ్ వచనం) అల్లాహ్ ఆజ్ఞ అంటే ఆయన పుట్టుక సృష్టి నిబంధనలకు భిన్నంగా దైవాజ్ఞ మేరకు జరిగిందని అర్థం. **'రూహుల్లాహ్'**(దైవాత్మ) అనేది అల్లాహ్ తరుపు నుండి ఆయనకు వొసగబడిన గౌరవాత్మకమ్మైన బిరుదు. అంతేగాని దైవాత్మ అంటే నిజంగానే దేవుని ఆత్మ అని అర్థం ఎంతమాత్రం కాదు. దివ్య ఖుర్‌ఆన్‌లో సమూద్ జాతి వైపునకు పంపబడిన ఒంటెను **'నాఖతుల్లాహ్'** (దేవుని ఒంటె) అని పిలవటం జరిగింది. (అది ఒక ఆడ ఒంటె, అది జంతువు కడుపున జన్మించినది కాదు. దానిని ఒక రాతి బండ నుండి అల్లాహ్ ప్రత్యక్ష పరిచాడు. మానవుల కొరకు అది ఒక నిదర్శనం. దాని కారణంగా ఆ ఒంటె దేవునికి ఆడబిడ్డ అని అంటారా?) అలాగే పవిత్ర కాబా గృహాన్ని **'బైతుల్లాహ్'**(దేవునిగృహం) అని వ్యవహరిస్తుంటాం.

https://teluguislam.net



అంత మత్రాన అది దేవుడు నివసించే ఇల్లని అర్థం చేసుకుంటామా? దేవుడు సప్తకాశాలపై మహోన్నత అధికార సిహాసనం (అర్ష్)పై అధిష్టించి ఉన్నాడన్న సంగతి అందరికీ తెలిసిందే కదా!

ఇకపోతే పై హదీసు ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే, ఘోరపాపానికి (కబీరా గునాహ్‌కు) ఒడిగట్టినంత మాత్రాన మనిషి విశ్వాస పరిధుల్ని అతిక్రమించినట్లు కాదు. మానవ సహజమైన దౌర్బల్యం వల్ల ఒక విశ్వాసి ఘోరపాపానికి ఒడిగట్టినప్పటికీ అతను విశ్వాసిగానే ఉంటాడు. అతణ్ణి స్వర్గప్రవేశం మాత్రం దేవుని యిష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. ఆయన తలచుకుంటే మొదట్లోనే అతని పాపాలన్నీ క్షమించేసి అతనికి స్వర్గప్రవేశాన్ని కల్పించవచ్చు. లేదా కొంతకాలం పాటు నరకంలో అతని పాపాలకు శిక్ష విధించి తరువాత స్వర్గానికి పంపవచ్చు. కాని విశ్వాసికి శాశ్వత నరకశిక్ష మాత్రం ఉండదు. పాపాలకు శిక్ష అనుభవించిన తరువాత అతనికి స్వర్గంలో ప్రవేశించే వీలు ఉంటుంది.[1]

## ఇస్లాం ధర్మాన్నే ప్రేమించాలి:

అల్లాహ్ ప్రసన్నత పొందుటకై ఏకైక ధర్మం ఇస్లామియ ధర్మం. ఆ ధర్మాన్ని ప్రేమించడమంటే, అల్లాహ్‌ను మాత్రమే నిజమైన దేవుడని మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని విశ్వసించాలి. మరియు గతంలో అల్లాహ్ వైపు నుండి పంపబడిన ప్రవక్తలను విశ్వసించాలి, వారికి ప్రసాదించబడిన

[1] (హదీసు కిరణాలు: 587-588)

https://teluguislam.net



గ్రంథాలను విశ్వసించాలి. అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానాలకు కట్టుబడి అనుసరించాలి. దీనినే ఇస్లామీయ పరిభాషలో **''ఇస్లాం ధర్మం''** అని అంటారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఈ రోజు మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా ఆమోదించాను.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు మీకు బద్ధ విరోధి.'' [2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ ఎవరికయినా మేలు చేయదలచుకుంటే వారికి (ఇస్లామీయ) ధర్మావగాహన శక్తిని ప్రసాదిస్తాడు.'' [3]

ఇస్లాం ధర్మాన్ని కాదని మనం ఇతర మార్గాలను అనుసరిస్తే ఆ ధర్మాలు లేక మార్గాలు ఆమోదించబడవు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా ఆల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపుకే మరలించబడతారు.'' – ఓ ప్రవక్త! వారితో ఇలా అను: 'మేము అల్లాహ్‌ను, మాపై అవతరింపజెయ్యబడిన దానినీ విశ్వసించాము. ఇంకా

---

[1] (సూరతుల్ మాయిదా:3).
[2] (సూరతుల్ బఖరా: 208).
[3] (బుఖారీ:69, ముస్లిం:1719).

https://teluguislam.net



ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబుపై, ఆయన సంతానంపై అవతరింపజెయ్యబడిన దానినీ, మూసా, ఈసా ఇంకా ఇతర ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన వాటిని మేము విశ్వసించాము. మేము వారి మధ్య ఎలాంటి భేదభావాన్ని కనబరచము. మేము ఆయనకే విధేయులము'' – ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేరిపోతాడు.'' [1]

అల్లాహ్‌ను తమ ప్రభువుగా, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ప్రవక్తగా మరియు ఇస్లాంను తమ దర్మంగా తమ హృదయపూర్వకంగా రాజి పడినట్లయితే అలాంటివారికి స్వర్గం కచ్చితంగా ప్రసాదించబడు తుంది, అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు.

హజ్రత్ అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే అల్లాహ్‌ను తమ ప్రభువుగా, ఇస్లాంను తమ ధర్మంగా, మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను తమ ప్రవక్తగా (హృదయ పూర్వకంగా) అంగీకరిస్తారో వారికి తప్పకుండా స్వర్గం లభిస్తుంది...'' [2]

హజ్రత్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ఒక రోజు ఆయన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఇస్లాం స్వీకరించాలంటూ పోయి, ''ఇస్లాం స్వీకరిస్తే నా పాపాలన్నీ క్షమించబడాలి'' అని షరతు పెట్టారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా

---

[1] (సూరతు ఆల ఇమ్రాన్:83–85).

[2] (ముస్లిం:3496).

https://teluguislam.net



జవాబిచ్చారు: ‘‘ఓ అమ్ర్ నీకు తెలియదా!? ఇస్లాం స్వీకరణ కారణంగా పూర్వపు పాపాలన్నీ తుడిచిపోతాయి....’’[1]

ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని తిరస్కరిస్తారో మరియు ఇస్లాం ధర్మానికి విముఖతను చూపుతారో వారికి ఆ అధికారం ఉంది. కాని వారికి బదులు అల్లాహ్ ఇస్లాం ధర్మాన్ని ఇతర ప్రజలను అనుగ్రహిస్తాడు. వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులవుతారు. మరియు అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుతాడు. ఆ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఓ విశ్వాసులారా! మీలో ఎవరయినా సరే తమ (ఇస్లాం)ధర్మం నుంచి తిరిగిపోతే (పోవచ్చు), అల్లాహ్ త్వరలోనే మరోజాతివారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు....’’ [2]

---

[1] (ముస్లిం:173).

[2] (సూరతుల్ మాయిదా:54). **ఇస్లాం ధర్మానికి చెందిన ముఖ్యమైన అంశాలు:**

ఇస్లామియ ధర్మం గురించి అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పుకోవటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, అల్లాహ్ దూతలను, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను హృదయ పూర్వకంగా విశ్వసించటం’’(2,సూరతుల్ బఖరా:177).

మరియు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖించారు: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో (ప్రజలతో) సమావేశమయి ఉండగా, అకస్మాత్తుగా ఒకవ్యక్తి మా వద్దకు వచ్చాడు. అతని బట్టలు ఎంతో తెల్లగా, శిరోజాలు మరెంతో నల్లగా ఉన్నాయి. అతన్ని చూస్తే ప్రయాణం చేసి వచ్చినట్టుగా గాని, అతను మాకు పరిచయమున్న వ్యక్తిగా గాని తెలియడం లేదు.

అతను వచ్చి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు దగ్గరగా కూర్చున్నాడు, అతను తన మోకాళ్ళను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మోకాళ్ళకు ఆనించాడు. తన రెండు చేతులు ప్రవక్త తొడలపై పెట్టాడు. ఆ తరువాత అతను ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం):

**‘‘మాకు ఇస్లాం గురించి తెలుపండి?’’ అని అడిగాడు.**

https://teluguislam.net



## సర్వ జనులకన్నా అల్లాహ్‌ను మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రేమించాలి:

అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞలకు అనుగుణంగా తమ ఇష్టాయిష్టాలను సమర్పించుకోవాలి. మరియు వారి ఆజ్ఞలకు అనుకూలంగా తమ జీవితాలను మార్చుకోవాలి. అల్లాహ్

---

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఇస్లాం అంటే అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడనీ, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ సందేశహరుడనీ నీవు సాక్ష్యం పలకడం, నమాజు చేయడం, జకాత్ చెల్లించడం, రమజాన్ ఉపవాసాలు పాటించడం, ప్రయాణ స్థోమత కలిగి ఉంటే హజ్ చేయడం.'' అని అన్నారు.

దానికతను: **''మీరు చెప్పింది నిజం''** అని అన్నాడు.

మాకు ఆశ్చర్యం కలిగింది. ''అతనే ప్రశ్నిస్తున్నాడు మరియు అతనే తిరిగి ధృవీకరిస్తున్నాడని''

ఆ తరువాత అతను: **''నాకు విశ్వాసం (ఈమాన్) గురించి తెలుపండి?''** అని అడిగాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''విశ్వాసం అంటే నీవు అల్లాహ్‌ను, అల్లాహ్ దూతలను, అల్లాహ్ గ్రంథాలను, అల్లాహ్ ప్రవక్తలను, (పరలోకంలో) అల్లాహ్ ముందు హాజరు కావలసి ఉంటుందన్న విషయాన్ని (మరణించిన తరువాత మానవులు) తిరిగి బ్రతికించబడతారన్న విషయాన్ని నమ్మాలి.'' మరియు **మేలైనా, కీడైనా** అల్లాహ్ తరఫునే జరుగుతుందన్న విషయాన్ని విశ్వసించాలి.'' అని సమాధానమిచ్చారు.

ఆ వ్యక్తి: **''మీరు చెప్పింది నిజం''** అని అన్నాడు.

తిరిగి ఆ వ్యక్తి: **''ఇహ్సాన్''** అంటే ఏమిటో నాకు తెలుపండి? అని అడిగాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇహ్సాన్ అంటే:

''నీవు అల్లాహ్‌ను చూస్తున్నట్లుగా (అత్యంత భయంభక్తితో) ఆరాధించాలి. నీవు ఆయనను చూడకపోయిన ఆయనయితే నిన్ను చూస్తునే ఉన్నాడు.'' (అన్న యదార్థాన్ని గుర్తించుకుంటూ ఆరాధించాలి) అని అన్నారు.

ఆ తరువాత అతను: **''నాకు ప్రళయాన్ని గురించి తెలుపండి?''** అని ప్రశ్నించాడు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ప్రళయం గురించి ప్రశ్నించేవాడికన్నా సమాధానమిచ్చేవాడికి ఎక్కువేమీ తెలియదు.'' అని బదులిచ్చారు....(ముస్లిం:9).

https://teluguislam.net



మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కన్నా ఏ విషయము మా మనుసుకు ప్రీతికరమ్మై ఉండకూడదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (దైవ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: ''ఒక వేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ సమీప బంధువులు, మీరు సంపాదించిన మీ సిరిసంపదలు, కుంటుపడుతుందేమోనని మీరు భయపడే మీ వర్తకం, మీకెంతో ప్రియమ్మైన మీ గృహాలు మీకు అల్లాహ్ కన్నా, ఆయన ప్రవక్త కన్నా, ఆయన మార్గంలో సలిపే పోరాటం కన్నా ఎక్కువ ప్రియమ్మైనవైతే అల్లాహ్ తీసుకువచ్చే తీర్పు(శిక్ష)కొరకు ఎదురు చూడండి. అల్లాహ్ అవిధేయులకు సన్మార్గం చూపడు.'' [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. మీలో ఎవరయినాసరే తన తండ్రికన్నా, తన సంతానంకన్నా, సమస్త జనులకన్నా అధికంగా నన్ను ప్రేమించనంత వరకూ–అతను విశ్వాసి కాజాలడు. [2]

ఒక సారి హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం) తమరు 'నాకు నా ప్రాణం తప్ప మిగిలిన వస్తువులన్నింటికన్నా ప్రియతములు' అని అన్నారు.

అప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): 'ఎవరయినాసరే తమ ప్రాణం కన్నా అధికంగా నన్ను ప్రేమించ నంతవరకూ అతను విశ్వాసి కాజాలడు'

---

[1] (సూరతు తౌబా:24).

[2] (బుఖారీ:14, ముస్లిం:63).

https://teluguislam.net



అని అన్నారు.

ఈ మాట వినగానే: 'అయితే దైవసాక్షిగా! ఇకనుంచి నేను నా ప్రాణం కన్నా ఎక్కువగా తమరిని ప్రేమిస్తున్నాను' అని హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) చెప్పారు.

అప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఓ ఉమర్! ఇప్పుడు నువ్వు విశ్వాసివి అయ్యావు' అని అన్నారు. [1]

ఒక సారి ఒక పల్లెవాసి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర సన్నిధికి వచ్చి, – 'ప్రళయం ఎప్పుడొస్తుంది?' అని అడిగాడు.

దైవ ప్రవక్త(స): 'దాని కోసం నువ్వేం ఏర్పాట్లు చేసుకున్నావు?' అనడిగారు.

దానికావ్యక్తి: **'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త గారిని ప్రేమించడం'** అని అన్నాడు.

అతని సమాధానం విని: **'అయితే నీవు ఎవరిని ప్రేమిస్తున్నావో! వారితోనే ఉంటావు'** అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు. [2]

## దృఢమయిన విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రేమించాలి:

మనం అల్లాహ్ దాసులం. ఆయన మనందరిపై అన్ని విధాలుగా కనికరించి ఉన్నాడు. కనుక మనం ఆయనను మన ప్రభువుగా, మన ఆరాధ్యునిగా, మన రక్షకుడిగా విశ్వసించాలి. అంటే దేవుని అధికారాన్ని ఆయన మహోన్నతమైన గుణగణాలను హృదయపూర్వకంగా విశ్వసించాలి. మరియు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్తనని మనసారా నమ్మి

---

[1] (బుఖారీ:6142).

[2] (బుఖారీ:3412, ముస్లిం:4775).

https://teluguislam.net



తదనుగుణంగా నడుచుకోవాలి. అంటే దైవాజ్ఞల్ని అనుసరించి, చెడులకు దూరంగా ఉండటం, సత్కార్యాలను మనస్ఫూర్తిగా పాటించటం. సత్కార్యాలలో అన్నిటికంటే గొప్ప సత్కార్యం అల్లాహ్ పట్ల ఈమాన్ (విశ్వాసం) కలిగి ఉండటం.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ఓ ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: "ఆరాధనను అల్లాహ్‌కే ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడింది. – ఆజ్ఞను శిరసావహించే వారిలో నేను తొలివాణ్ణి కావాలని కూడా నాకు ఆజ్ఞాపించబడింది."[1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "కనుక (ఓ ప్రవక్తా!) అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో. నీ పొరపాట్లకు గాను క్షమాపణ వేడుకుంటూ ఉండు. విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీలందరి (మన్నింపు) కోసం కూడా వేడుకుంటూ ఉండూ మీ రాకపోకల గురించి మీ విశ్రాంతి గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు."[2]

ఈ లోకంలో ఒక మనిషి ధనం ఎంత సంపాదించాడు, ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు అన్న విషయాలు ముఖ్యం కావు. కాని దేవుని గురించి ఎంతవరకు తెలుసుకున్నాడు, దేవుణ్ణి ఆరాధిస్తున్నాడా? దేవుని ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నాడా? పరలోక జీవితంలో సాఫల్యం చెందుతాడా? దేవుని ప్రేమకు అర్హుడా? ఆ అర్హతలు సాధించాలంటే చేయవలసిన కార్యాలను తెలుసుకోవడం ఎంతో ప్రాముఖ్యమైనది. ఎందుకంటే? అల్లాహ్ మానవులను

---

[1] (సూరతుజ్ జుమర్:11–12).

[2] (సూరతు ముహమ్మద్:19).

https://teluguislam.net



సృష్టించినది అల్లాహ్‌ను విశ్వసించి, ఆయనను ఆరాధించటానికే అన్న విషయం మనం తెలుసుకోవాలి.

ప్రియమైన సోదరులారా! ఎప్పుడైతే దేవుని గురించి చర్చిస్తామో అప్పుడు మన హృదయాలు దేవుని పట్ల విశ్వాసంతో, ప్రేమతో నిండిపోవాలి. దేవుని గురించి చర్చించే సభలలో హాజరైనప్పుడు మన హృదయాలు భయం, భక్తి మరియు ప్రేమానురాగాలతో పులకించిపోవాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నిజమైన విశ్వాసులు ఎటువంటివారంటే – అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదయాలు భయంతో వణుకుపోతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠించినపుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధిచేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు.’’ [1]

మరొకచోట ఇలా తెలియజేశాడు: ‘‘కాని అల్లాహ్ విశ్వాసాన్ని మీకు ప్రియతమం చేశాడు. దాన్ని మీ హృదయాలలో శోభాయమానంగా చేశాడు. అవిశ్వాసం పట్ల, దుర్వర్తన పట్ల, అవిధేయత పట్ల, మీకు రోత కలిగేలా చేశాడు. ఇలాంటివారే సన్మార్గ గాములు. – (అది అల్లాహ్ తరుఫు నుండి) వారికి లభించిన అనుగ్రహం మరియు ఉపకారం. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు వివేకవంతుడు.’’ [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘మరెవరయితే తాగూత్ (షైతాన్, దైవేతరుల) దాస్యానికి దూరంగా ఉన్నారో, (సంపూర్తిగా) అల్లాహ్

---

[1] (సూరతుల్ అన్ఫాల్:2).

[2] (సూరతుల్ హుజురాత్:7-8).

https://teluguislam.net



వైపుకు మరలారో, వారు శుభవార్తకు అర్హులు. కనుక (అటువంటి) నా దాసులకు (ఓ ముహమ్మద్!) శుభవార్తను వినిపించు.–వారు (అల్లాహ్) మాటను శ్రద్ధగా వింటారు. అందులోని మంచి విషయాన్ని ఖచ్చితంగా అనుసరిస్తారు. అల్లాహ్ సన్మార్గం చూపినది కూడా వారికే.''[1]

ఇంకా అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మరెవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసిస్తారో వారే తమ ప్రభువు దగ్గర సత్యవంతులు, సాక్షులు. వారి కొరకు వారి పుణ్యఫలం కూడా ఉంటుంది. వారి జ్యోతి కూడ ఉంటుంది....''[2]

మరియు ఒక హదీసులో; సిద్ధీఖులకు (సత్యవంతులకు) స్వర్గంలో లభించే గొప్ప స్థానం గురించి ఈ విధంగా తెలుపబడింది:

''స్వర్గవాసులు తమపై అంతస్థు వారిని చూస్తారు. వారు ప్రకాశించే తూరుపు లేక పశ్చిమ తారల వలె ఆకాశపుటంచున ఉన్నట్లు కనిపిస్తారు. అంటే క్రిందివారికీ –పై వారికీ అంతటి వ్యత్యాసం ఉంటుంది.''

**'బహుశా అవి ప్రవక్తల ఉన్నత స్థానాలై ఉంటాయి. సామాన్యులకు ఆ స్థానాలు లభించవు'** అని సహచరులు అభిప్రాయపడగా!

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'అవును'. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ''వారు అల్లాహ్‌ను విశ్వసించటంతో పాటు, దైవప్రవక్తలను సత్యసంధులుగా ధృవీకరించినారు.''[3]

---

[1] (సూరతు జుమర్:17–18).

[2] (సూరతుల్ హదీద్:19).

[3] (బుఖారీ:3016, ముస్లిం:5059).

https://teluguislam.net



అంటే ఈమాన్ (విశ్వాసం) మరియు తస్‌దీఖ్ (ధృవీకరణ) హక్కును సజావుగా నెరవేర్చారు. [1]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు:

**' ఈ మూడు లక్షణాలున్న వ్యక్తి విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.'**

1-అల్లాహ్ మరియు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు అందరికన్నా ప్రియతములై ఉండాలి.

2-కేవలం దైవప్రసన్నత కోసమే తోటి వ్యక్తిని ప్రేమించాలి.

3-అల్లాహ్ తనను అవిశ్వాస స్థితినుండి రక్షించిన తరువాత తిరిగి దానివైపుకు మరలిపోవటాన్ని తను అగ్నిలో పడటాన్ని ఎంతగా అసహ్యించుకుంటాడో అంతగా అసహ్యించుకోవాలి. [2]

## విశ్వాసం మరియు ఏకదైవారాధన అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం:

అల్లాహ్‌ను మాత్రమే ఏకైక ఆరాధ్యునిగా విశ్వాసించటం ద్వారా మనం అల్లాహ్ ప్రసన్నత మరియు ప్రేమ పొందుటకు అర్హులు కాగలుగుతాము. మరియు అదే మన జీవిత చివరి కార్యమై ఉండాలి. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఎవరయితే మా ప్రభువు అల్లాహ్‌యే' అని పలికి, తర్వాత దానిపై గట్టిగా నిలబడ్డారో వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ లేదు.-వారే స్వర్గవాసులు. వారందులో కలకాలం ఉంటారు. వారు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం ఇది.'' [3]

---

[1] (ఫత్‌హుల్ బారీ, అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2388).

[2] (బుఖారీ:15, ముస్లిం:61).

[3] (సూరతుల్ అహ్‌ఖాఫ్:13-14) అలాగే సూరతుల్ ఫుస్సిలత్: 30-32 లో కూడా ఉంది.

https://teluguislam.net



మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నిశ్చయంగా విశ్వసించి, సత్కార్యాలు చేసినవారి యెడల కరుణామయుడైన అల్లాహ్ ప్రేమానురాగాలను సృజిస్తాడు.’’ [1]

ప్రపంచ మానవులందరూ మరియు వివిధ మతాలను అనుసరించే వారు కూడా అల్లాహ్‌ను విశ్వసించాలి. ఎందుకంటే సర్వ మానవాళికి దేవుడు ఒక్కడే, వారి ధర్మం కూడా ఒక్కటే. కనుక ఆ కరుణామయుడు ప్రజలందరిని ఇస్లాం ధర్మం వైపు అహ్వానిస్తున్నాడు. ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో అల్లాహ్ వారందరిని కూడా ప్రేమిస్తాడు, కరుణిస్తాడు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘విశ్వసించినవారైనా, యూదులైనా, క్రైస్తవులైనా, సాబియనులైలయినా ఎవరయినాసరే – అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించి సదాచరణ చేస్తే వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.’’ [2]

విగ్రహాలను, శిలువను, అగ్నినీ, మరే యితర వస్తువులను దేవుళ్ళుగా చేసుకొని ఆరాధిస్తున్నారో వారందరిని వదిలిపెట్టి, దేవుడు ఒక్కడే అన్న అసలైన నమ్మకం వైపునకు మరలండి. మరియు మనంమందరం సమానంగా దేవుడు ఒక్కడే అన్న విశ్వాసంపై కట్టుబడి ఉండి,ఆ అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిద్దాం. ఆ విషయం వైపుకే సర్వ ప్రజలను అల్లాహ్ ఇలా పిలుపునిచ్చాడు:

---

[1] (సూరతు మర్యమ్:96).

[2] (సూరతుల్ బఖరా: 62) మరియు సూరతుల్ మాయిదా: 69 లో కూడా ఉంది.

https://teluguislam.net



(ఓ ప్రవక్తా!)వారికి స్పష్టంగా చెప్పు: ‘‘ఓ గ్రంథవహులారా! ‘మాలోనూ, మీలోనూ సమానంగా ఉన్న ఒక విషయం వైపుకు రండి. అదేమంటే మనం అల్లాహ్‌ను తప్ప వేరెవరిని ఆరాధించ కూడదు, ఆయనకు భాగస్వాములుగా ఎవరిని కల్పించరాదు. అల్లాహ్‌ను వదిలి మనలో ఎవరూ ఇంకొకరిని ప్రభువులుగా చేసుకోరాదు.’ ఈ ప్రతిపాదన పట్ల గనక వారు విముఖత చూపితే, ‘మేము మాత్రం ముస్లిములము అన్న విషయానికి మీరు సాక్షులుగా ఉండండి’ అని వారికి చెప్పేయండి.’’ [1]

హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం: ఒక రోజు నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)సవారిపై వెనుక కూర్చొని ఉన్నాను. అప్పుడు ఆయనన్నుద్దేశించి ఇలా అన్నారు: **‘‘అబ్బాయీ!** నేను నీకు కొన్ని ముఖ్యమయిన విషయాలు చెప్తాను. (వాటిని నీవు సదా గుర్తుంచుకో)!

నీవు అల్లాహ్‌ను (అంటే ఆయన ఆదేశాలను) కాపాడు; ఆయన నిన్ను కాపాడుతాడు.

నీవు దేవుని (హక్కులను) గుర్తుంచుకో; ఆయన నీ ముందున్నట్లే గ్రహిస్తావు. (అంటే ఆయన రక్షణ, సహాయ సహకారాలు నీ వెంటనే ఉంటాయి).

నీవు అర్థించదలుచుకున్నప్పుడు ‘అల్లాహ్‌నే అర్థించు.’

నీవు సహాయం కోరాలంటే(సాధనాలు ఉపయోగించటంతోపాటు)

‘అల్లాహ్‌నే సహాయం కోసం అర్థించు.’

**జాగ్రత్త!** లోకమంతా ఏకమై నీకు మేలు చేకూర్చాలనుకున్నా అల్లాహ్ నీకోసం వ్రాసి పెట్టిన దానికంటే ఎక్కువేమీ అది నీకు మేలు చేకూర్చ జాలదు. ఒకవేళ నీకు కీడు తలపెట్టాలన్న ఉద్దేశ్యంతో ఏకమైనా కూడ

[1] (సూరతు ఆల ఇమ్రాన్:64).

https://teluguislam.net


అల్లాహ్ నీ కోసం వ్రాసి ఉంచిన దానికంటే ఎక్కువ నష్టమేమీ అది కలిగించజాలదు. ఎందుకంటే? కలములు పైకి లేపుకోబడ్డాయి (అంటే విధివ్రాత రాయటం ఆయిపోయింది.) పత్రాల సిరా ఆరిపోయింది.''[1]

మరియు హజ్రత్ జాబిర్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక పల్లెవాసి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి,

**''ఓ అల్లాహ్ ప్రవక్తా! (స్వర్గాన్ని గాని నరకాన్ని గాని) అనివార్యం చేసే రెండు స్థితులేవి?''** అని అడిగాడు.

దానికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): ''ఎవరైతే బహుదైవారాధనకు గురికాకుండా మరణిస్తారో వారు స్వర్గానికి ప్రవేశిస్తారు. మరియు ఎవరైతే బహుదైవారాధన చేస్తూ మరణిస్తారో వారు నరకానికి చేరుకుంటారు.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మీరు చేసే మూడు పనుల వల్ల అల్లాహ్‌కు సంతోషం కలుగుతుంది. మరియు మూడు పనుల వల్ల అసహ్యం కలుగుతుంది.''

**అల్లాహ్‌కు సంతోషం కలిగించే పనులు;**

1) మీరు (అల్లాహ్)కు సహవర్తులుగా ఎవ్వరిని నిలబెట్టకుండా ఆయన్నే ఆరాధించడం.

2) మీరందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోవటం. (కలిసి మెలిసి ఉండటం).

3) పరస్పరం విడిపోకుండా ఉండటం.

---

[1] (తిర్మిజీ: 2516, సహీహ్ అల్ జామి:7957).

[2] (ముస్లిం:135).

https://teluguislam.net



**మరియు అల్లాహ్‌కు అసహ్యం కలిగించే పనులు:**

1) పనికిమాలిన సంభాషణలు జరపటం.

2) మితిమీరిన ప్రశ్నలు.

3) ధనం వృధా చేయటం.[1]

## అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతే ప్రేమకు పునాది:

ముస్లిములందరూ అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని అందరికంటే ఎక్కువగా ప్రేమించాలి. ఆ ప్రేమించే విధానాన్ని కూడా ఆ అల్లాహ్‌యే మనకు నేర్పించాడు. కనుక వారి ప్రేమను మనం నోచుకోవాలంటే మరియు వారిని ప్రేమించాలంటే అతి ఉత్తమమ్మైన విధానం వారి విధేయతను పాటించడమే అన్న విషయం మనం తెలుసుకోవాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఎవరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, అల్లాహ్‌కు భయపడుతూ ఆయన (శిక్షల) నుండి తమను కాపాడుకుంటారో వారే విజయం సాధించేవారు.’’[2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: ‘‘మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా

---

[1] (ముస్లిం:3236).

[2] (సూరతున్ నూర్:52).

https://teluguislam.net



కనికరించేవాడు.''– ఇంకా వారికి ఇలా చెప్పు: ''మీరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి. ఒకవేళ వారు విముఖత చూపితే అల్లాహ్‌ తిరస్కారులను ఏ మాత్రం ఇష్టపడడు.'' [1]

ఇంకా అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది. అల్లాహ్‌ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు.''[2]

హజ్రత్‌ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్‌ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

'నా ఉమ్మతకు (సమాజం) చెందిన ప్రతి ఒక్కరూ స్వర్గంలోకి ప్రవేశిస్తారు (స్వర్గం) వద్దనుకున్నవారు తప్ప.
యా రసూలల్లాహ్‌! స్వర్గంలోకి ప్రవేశించడం ఎవరు వద్దనుకుంటారు? అని కొందరు అడిగారు.
దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం): ''నాకు విధేయత చూపినవారు స్వర్గానికి పోతారు. నన్ను ధిక్కరించినవారే స్వర్గంలోకి ప్రవేశించడానికి నిరాకరించినవారు'' అని సమాధానమిచ్చారు. [3]

దైవ ప్రవక్తను అనుసరించటం వల్ల మీ పాపాలు క్షమించబడటం ఒక్కటే కాదు. మీరు దైవానికి ప్రియతములుగా కూడా ఖరారు చేయబడతారు. ఒక మనిషి అల్లాహ్‌ సమక్షంలో ప్రియతమునిగా నిలబడటం అంటే సామాన్య విషయం కాదు – అది ఎంతో ఉన్నతమైన స్థానం, అది మహా భాగ్యవంతుల స్థానం. కనుక అల్లాహ్‌ ఇలా తెలియజేశాడు:

---

[1] (సూరతు ఆలి ఇమ్రాన్‌:31–32).
[2] (సూరతుల్‌ అహ్‌జాబ్‌:21).
[3] (బుఖారీ:6737).

https://teluguislam.net



''ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు. – ఇదీ అల్లాహ్ తరుపు నుంచి లభించే అనుగ్రహం. తెలుసుకోవటానికి అల్లాహ్‌యే చాలు.'' [1]

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత కనబరిచినవారికి లభించే పుణ్యఫలం ఎటువంటిదో ఇక్కడ చెప్పటం జరిగింది. **''మనిషి ఎవరిని అభిమానిస్తాడో వారి సాంగత్యమే అతనికి లభిస్తుంది.''** అన్న హదీసు ఈ సందర్భంగా గమనార్హం.[2]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) ఇలా అంటున్నారు: ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నోట వెలువడిన ఈ ప్రవచనం విన్నప్పుడు సహాబాలకు కలిగినంత ఆనందం మరెన్నడూ కలగలేదు'' ఎందుకంటే? వారు స్వర్గంలో కూడా తమ ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంగత్యాన్ని కోరుకునేవారు.

ఈ ఆయతు పూర్వరంగానికి సంబంధించిన ఉల్లేఖనాల్లో ఇలా చెప్పబడింది: కొంతమంది సహచరులు వచ్చి,

''ఓ దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం)! అల్లాహ్ మీ కొరకు స్వర్గంలో ఉన్నత స్థానాలను ప్రసాదిస్తాడు. మాకు అంతకన్నా అధమ స్థానమే లభిస్తుంది. అందువల్ల మేము అక్కడ మీ సాంగత్యానికి దూరమై పోతాము.

---

[1] (సూరతున్ నిసా:69–70).

[2] (బుఖారీ:5702, ముస్లిం:4779).

https://teluguislam.net



ప్రపంచంలో మాకు ప్రాప్తించిన మీ సహచర్య భాగ్యం పరలోకంలో ప్రాప్తించదు కదా!'' అని సందేహపడ్డారు.

అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి వారి వారి మనసులు కుదుటపడేలా చేశాడు (ఇబ్నె కసీర్).

మరి కొంత మంది సహచరులైతే స్వర్గంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచర్యం కోసం ప్రత్యేకంగా విన్నపాలు చేసుకున్నారు. అలాంటి వారిని ఉద్దేశ్యించి, నఫిల్ (స్వచ్ఛంద) నమాజులు అత్యధికంగా చేయమని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తాకీదు చేశారు. ''మీరు (వీలైనన్ని) ఎక్కువ సజ్దాల ద్వారా నాకు తోడ్పడండి'' అని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు.[1]

ఇంకొక హదీసులో ఇలా అనబడింది – ''సత్యసంధుడు, నిజాయితీ పరుడైన వర్తకుడు ప్రవక్తల, సిద్దీఖుల (సత్యసంధుల), షహీదుల (అమర వీరుల)లతో పాటు ఉంటాడు.'' [2]

విశ్వాసంలోనూ విధేయతలోనూ పరిపూర్ణ స్థాయికి చేరుకున్న వారిని 'సిద్దీఖులు'గా వ్యవహరిస్తారు. ప్రవక్త పదవి (నబువ్వత్) తరువాతి స్థానం ఇదే. మహనీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అనుచర సమాజంలో ఈ అంతస్థు పొందిన వారిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజియల్లాహు అన్హు) అగ్రగాములు. అందుకే ప్రవక్తేతర వ్యక్తులలో మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తరువాతి స్థానం ఆయనదే అన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇక దేవుని హక్కులతో పాటు, దాసుల

---

[1] (సహీహ్ ముస్లిం కితాబుస్సలాత్).

[2] (తిర్మిజీ:1130 కితాబుల్ బుయూ).

https://teluguislam.net



హక్కులను కూడా పూర్తిగా నెరవేరుస్తూ, అందులో ఎలాంటి లోటు రానివ్వకుండా జాగ్రత్త పడేవారిని సజ్జనులు (సాలిహీన్) అని అంటారు.[1]

ఇలా ఖుర్‌ఆన్ గ్రంథంలో ముప్పై కన్న ఎక్కువ ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ మరియు ప్రవక్త విధేయతను పాటించువారు అల్లాహ్ ప్రేమ, కారుణ్యం పొందుతారు. మరియు ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ స్వర్గంలో ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు.

ఖుర్‌ఆన్ ఆయతుల ద్వారా మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసుల ద్వారా అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమ ప్రసన్నతకు సంభందించిన 'గీటురాయి' వారి విధేయత అని నిర్ధారించడం జరిగింది. ఆ గీటురాయిపై మేలిమి అని తేలినవారు సాఫల్యం పొందినట్లే లెక్క. లేకుంటే వారి ప్రేమ బూటకమైనది. మరియు వారి విధేయత పాటించని పక్షంలో అల్లాహ్ ఆగ్రహానికి గురికాబడతారు. మార్గభ్రష్టులుగా తయారయి నరకానికి ప్రవేశిస్తారు.

కనుక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''మాతో సంబంధం లేని – అంటే మేము చూపిన పద్ధతికి భిన్నమైన – రీతిలో ఎవరైనా ఏదన్నా ఆచరిస్తే అది త్రోసిపుచ్చదగినది.''[2]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''వాక్యాలలో అన్నిటికంటే సత్యమైన వాక్యం అల్లాహ్ గ్రంథం (ఖుర్‌ఆన్). మరియు మార్గాలన్నిటిలోకి అతి ఉత్తమమైన మార్గం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గం.

[1] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: పేజి:389-390).

[2] (బుఖారీ:2499, ముస్లిం:3242).

https://teluguislam.net



మరియు ఆచారాలలో అతి చెడు ఆచారం క్రొత్త ఆచారాలు, మరియు ప్రతి క్రొత్త ఆచారం బిద్‌అత్, ప్రతి బిద్‌అత్ మార్గవిహీనమ్మైనది. మరియు ప్రతి మార్గవిహీనత నరకానికి తీసుకువెళ్ళుతోంది...''[1]

## దృఢమ్మైన నమ్మకం (తవక్కుల్ ) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

అల్లాహ్ ప్రేమను పొందాలంటే అల్లాహ్‌పై దృఢమ్మైన నమ్మకం కలిగి ఉండాలి. మనం కృషి, సాధన సంపత్తిపైనే పూర్తిగా ఆధార పడకుండా, అల్లాహ్ అభీష్టం కూడా దానికి తోడ్పడాలి. మరియు అల్లాహ్ అభీష్టం ప్రకారమే మా కార్యాలకు సత్ఫలితాలు లభిస్తాయన్న విశ్వాసం ఉండాలి. ఎలాంటి కార్యసాధనాలు నెరవేర్చాలన్నా అల్లాహ్ అభీష్టం లేనిదే జరగవు. కొంతమంది ప్రజల ఆలోచనల ప్రకారం కార్యాలన్ని అల్లాహ్ అభీష్టం ప్రకారమే జరుగుతాయి అంటూ చేతులు ముడుచుకొని ఒక మూలన కూర్చుంటే దానిని 'తవక్కుల్' అని తప్పుగా అర్థం చేసుకుంటారు. కాని 'తవక్కుల్' అనే పదానికి సరైన అర్థం: **''ఒక మనిషి తన శక్తివంచన లేకుండా చేసిన కృషి తరువాత దానికి బదులుగా (లాభమ్మైన లేక నష్టమ్మైన) లభించే ఫలితమే అల్లాహ్ నిర్ణయంగా భావించాలి.''** అలాంటి నమ్మకం కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. దాని కారణంగా అల్లాహ్ వారికి అమితంగా ఉపాధిని కూడా ప్రసాదిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి క్షమాపణ కోసం (అల్లాహ్‌ను) వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు.

---

[1] (ఇబ్ను ఖుజైమా, సహీహుల్ జామే:1353).

https://teluguislam.net



ఏదైనా పని గురించి తుది నిర్ణయానికి వచ్చినప్పుడు, అల్లాహ్‌పై భారం మోపు. నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు.''[1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిజమైన విశ్వాసులు ఎటువంటి వారంటే అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదాయాలు భయంతో వణుకుతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠించ బడినప్పుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధిచేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు.''[2]

ఒక సందర్భంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''విచారణ లేకుండా డెబ్బై వేల మంది ప్రజలు స్వర్గానికి ప్రవేశిస్తారు. వారు ఎవరంటే? వారు ఎన్నడూ మంత్రాలు చదివి ఊదటం, జాల విద్య చేయటం వంటివి చేయరు. ఇతరుల చేత కూడా చేయించరు, ఇంకా దుశ్శకునాలను పాటించరు. కేవలం తమ ప్రభువుపైనే నమ్మకం కలిగి ఉంటారు.''[3]

పక్షులు ప్రతి రోజు ఉదయాన్నే ఆకలితో ఎగురుకుంటూ ఆహారం కోసం అన్వేషించి సాయంత్రం తమ గూళ్ళకు కడుపు నింపుకొని చేరుకుంటాయి. అదే విధంగా అల్లాహ్‌ను నమ్ముకున్న ప్రజలు కూడా తమ శక్తి వంచన లేకుండా కృషి చేసి దాని ఫలితాల కొరకు అల్లాహ్‌ను నమ్ముకుంటారు. ఎలాగైతే అల్లాహ్ పక్షులను ప్రతి రోజు కడుపు నింపుతున్నాడో అలాగే ఆయనను నమ్ముకున్నవారికి కూడా ఉపాధిని ప్రసాదిస్తాడు.

---

[1] (సూరతు ఆల ఇమ్రాన్: 159).

[2] (సూరతు అన్ఫాల్:2).

[3] (బుఖారీ:8991, ముస్లిం:321).

https://teluguislam.net



కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''మీరు అల్లాహ్‌పై ఏ విధంగా నమ్మకం ఉంచాలో ఆ విధంగా నమ్మకాన్ని కలిగివుంటే ఆయన పక్షులకు ఆహారాన్ని ప్రసాదించినట్లే మీకు కూడా ఉపాధిని ప్రసాదిస్తాడు. పక్షులు ఉదయం పూట ఆకలితో బయలుదేరి సాయంత్రానికి కడుపు నింపుకొని తిరిగి వస్తాయి.''[1]

## ఈమాన్ స్థిరత్వం (ఇస్తేఖామత్) కలవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

స్థయిర్యాన్ని ప్రదర్శించడమంటే ఇస్లాం ధర్మంలోని నిషేధాలను అమలు పరచడంలో నిలకడగా ఉండటం. దైవాజ్ఞల్ని, విధులను, దైవ ప్రవక్త సంప్ర దాయాలను, పుణ్యకార్యాలను నిర్వర్తించడంతో పాటు దేవుని నిషేధాజ్ఞలకు, వారింపులకు దూరంగా ఉండటాన్నే **'ఇస్తేఖామత్'** అంటారు.

మరియు మనసారా అల్లాహ్‌ను ప్రేమిస్తూ, ఆయన్ని మాత్రమే ఆరాధిస్తూ, ఆయన ఆదేశాల పట్ల విధేయత పాటిస్తూ ఉండటాన్ని 'ఇస్తేఖామత్' అంటారు. మరియు అల్లాహ్ ప్రేమను మనం పొందాలంటే అన్ని సమయాల్లోను (సుఖదుఃఖాలలో, కష్టనష్టాలలో) అల్లాహ్ ఆజ్ఞలపైనే స్థిరంగా ఉండటాన్ని **'ఇస్తేఖామత్'** అంటారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''అలిఫ్-లామ్-మీమ్.** ''మేము విశ్వసించాము'' అని చెప్పినంత మత్రాన తాము ఇట్టే వదలి వేయబడ తామనీ, తాము పరీక్షించబడమని ప్రజలు అనుకుంటున్నారా?- వారి

[1] (తిర్మిజీ2/55, హాకిమ్4/318, అహ్మద్1/30).

https://teluguislam.net



పూర్వీకులను కూడా మేము బాగా పరీక్షించాము. వీరిలో సత్యవంతులెవరో, అసత్యవాదులెవరో నిశ్చయంగా అల్లాహ్ తెలుసుకుంటాడు.''[1]

**''మేము విశ్వసించాము''** అని నోటితో చెప్పినంతమాత్రాన, పరీక్షించకుండానే వదిలి వేయబడటం జరుగుతుందని భావించటం సరైనది కాదు. వారు ధన ప్రాణాల ద్వారా పరీక్షించబడతారు. కష్టాల ద్వారా పరీక్షించబడతారు. ఆకలిబాధ ద్వారా పరీక్షించబడతారు. ఈ పరీక్షల ద్వారా కల్తీ సరుకు ఏదో – మేలిమి సరుకు ఏదో, నిజాయితీపరులెవరో – నయవంచకులెవరో నిగ్గుదేల్చటం జరుగుతుంది. [2]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''నిశ్చయంగా అల్లాహ్‌యే తమ ప్రభువనీ ప్రకటించి, దాని (ఆ మాట) పైనే స్థిరంగా ఉండిపోయిన వారికి ఎలాంటి భయం లేక దుఃఖం అంటూ ఉండదు. అటువంటి వారే స్వర్గానికి పోయేవారు. అక్కడే వారు శాశ్వతంగా ఉంటారు. వారు (ప్రపంచంలో పుణ్యకార్యాలు) చేసిన పనులకు ప్రతిఫలంగా (స్వర్గం) ప్రసాదించబడింది.'' [3]

అంటే ఆ అల్లాహ్‌యే ఒకే ఒక్క దేవుడు. సాటిలేనివాడు, ఆయన ప్రభువు, పాలకుడు, పోషకుడు. ఒక వైపున ఆయన ప్రభుత్వాన్ని ఒప్పుకుంటూ, మరోవైపు ఆయన దైవత్వంలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించటం తగని పని. మనందరి ఆరాధ్య దైవం అల్లాహ్ ఒక్కడే! కనుక ఆయన పట్ల ప్రేమ, భయం, భక్తి, ఆశ, భరోస, మర్యాదలు కలిగి ఉండాలి.

---

[1] (29, సూరతుల్ అన్‌కబూత్:1–3).
[2] (అహ్‌సనుల్ బయాన్–తెలుగు:1708).
[3] (46,సూరతుల్ అహ్‌ఖాఫ్: 13–14).

https://teluguislam.net



మరియు శరణు కోరడం, సహాయనికై అర్థించడం, మొర పెట్టుకోవడం అంటూ జరిగితే అల్లాహ్ పేరున మాత్రమే జరగాలి. మరియు సజ్దాలు చెయ్యడము, ఖుర్బాని చెయ్యడము, మ్రొక్కుబడులు చెల్లించడము వంటి ఆరాధనలు అల్లాహ్ కొరకు మాత్రమే సమర్పించాలి.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని (అల్లాహ్)ధర్మంపై నిలుపు'' అంటే దేవుని ఏకత్యం (తౌహీద్)పై, ఆయన ఆరాధనపై స్థిరంగా ఉండండి. మిథ్యా ధర్మాల వైపుకు వెళ్ళకండి. [1]

ఒక రోజు అబూ అమ్ర్ సుఫ్యాన్ బిన్ అబ్దుల్లాహ్ (రజియల్లాహు అన్హు) గారు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి:

**యా రసూలల్లాహ్!** 'నాకేదైనా సమగ్రమైన విషయం బోధించండి. ఆ తరువాత నేను ఎవరినీ ఏమీ అడిగే అవసరం ఉండకూడదు' అని అభ్యర్థించారు.

దానికి ఆయన (స): ''నేను అల్లాహ్‌ను విశ్వసించాను అని చెప్పు. ఆ తరువాత ఆ మాటపైన గట్టిగా నిలబడు'' అని ప్రబోధించారు.[2]

ఎవరైతే అల్లాహ్‌ను నమ్మి, ఆ నమ్మకంపై స్థిరంగా ఉంటారో అటువంటి వారికి అల్లాహ్ ఇలా శుభవార్తను తెలియజేశాడు:

**'మా ప్రభువు అల్లాహ్ మాత్రమే'** అని పలికి దానిపై స్థిరంగా ఉన్న వారివద్దకు దైవ దూతలు దిగి వచ్చి, (ఇలా అంటూ ఉంటారు): ''మీరు భయపడకండి. దుఃఖించకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గలోకపు శుభవార్తను అందుకోండి. – ప్రాపంచిక జీవితంలో కూడా మేము

---

[1] (సూరతుర్ రూమ్:30).

[2] (ముస్లిం:55).

https://teluguislam.net



నేస్తాలుగా ఉంటూ వచ్చాము. పరలోకంలోకూడా ఉంటాము. మీ మనసు కోరినదల్లా, మీరు అడిగినదల్లా అందులో మీకు లభిస్తుంది. – క్షమాశీలి, దయాశీలి (ఆయన అల్లాహ్) తరఫున లభించే ఆతిథ్యమిది.'' [1]

మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''ఓ నా దాసులారా! ఈ రోజు మీకు ఎలాంటి భయం లేదు. ఎలాంటి దుఃఖం కూడా లేదు. మా వాక్యాలను విశ్వసించి విధేయులుగా ఉండి జీవితం గడిపినందుకు, మీరూ, మీ భార్యలూ స్వర్గంలో సంతోషంగా ప్రవేశించండి.'' [2]

[1] (సూరతు అస్సజ్‌దహ్: 30–32).

[2] (43,సూరతుజ్ జుఖ్‌రుఫ్:68–70).